క్లుప్తంగా

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి అర్చకులు విశేశ్వరప్రసాద ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సీటీఎంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కుమారస్వామి ప్రత్యేక పూజలు చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం శ్రీ నేల మల్లేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్టు ఈవో మంజుల తెలిపారు. దేవాదాయ శాఖ మదనపల్లె ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ సమక్షంలో ఆదాయాన్ని లెక్కించగా, రూ. 23,648 వచ్చిందన్నారు. హుండీ ఆదాయం మొత్తాన్ని ఇండియన్ బ్యాంక్ వాయల్పాడు శాఖలోని దేవస్థానం ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తవళం సర్పంచ్ రెడ్డప్ప, మాజీ ఆలయ కమిటీ అధ్యక్షులు మేష రామకృష్ణ, రాజన్న, ఆలయ పూజారి శంకర స్వామి పాల్గొన్నారు.

రేపు కాల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: ప్రయాణికుల సమస్యలు, ఆదాయం పెంచేందుకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు శనివారం కాల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ బి.అమరనాథ్ తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి 12 వరకు జరిగే కార్యక్రమంలో ఫోన్ నంబర్ 995922677కు సమస్యలను తెలియజేయాలని సూచించారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి

కలకడ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి కలకడ మండలం నుంచి అధికసంఖ్యలో హాజరు కావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి కోరారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన వైనం.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై ఈ సమావేశంలో చర్చిస్తారని తెలిపారు.

నేడు మూడోసారి వేలం

బి.కొత్తకోట: స్థానిక గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చెందిన వాణిజ్య గదులు, ఖాళీస్థలాల లీజు అప్పగింతకు శుక్రవారం దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు వేలంపాటలను నిర్వహిస్తున్నారు. వేలం పాటల్లో విధి విధానాలు పాటించడం లేదని, అధికారుల తీరుపై సాక్షిలో ప్రచురితమైన కథనంతో స్థానికుల్లో చలనం వచ్చింది. దీంతో నిబంధనల మేరకే వేలంపాటలు నిర్వహించాలని గతంలో రెండుసార్లు నిర్వహించిన వేలంపాటలను స్థానికులు పట్టుబట్టారు. దీంతో ఇప్పుడు మూడోసారి వేలం పాట నిర్వహించనున్నారు. ఇందులో వాణిజ్య గదులతోపాటు గంగమ్మ ఆలయానికి చెందిన మాన్యం భూమిని స్థలాలుగా లీజుకు ఇచ్చేలా వేలం పాట నిర్వహించనున్నారు.

'ఒలంపియాడ్'లో విదార్థుల ప్రతిభ



ప్రతిభకనబరిచిన విద్యార్థులతో పాఠశాల అధ్యాపకులు

మదనపల్లె సిటీ: ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షల్లో మదనపల్లె మండలం సీటీఎంలోని శ్రీ షిర్డి సాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మోదిని అనే విద్యార్థి సైన్సు సబ్జెక్టు నందు స్టేట్ టాపర్‌గా నిలిచి బంగారు పతకంతో పాటు రూ.వెయ్యి నగదు బహుమతి అందుకుంది. సురేష్ డ్రాయింగ్‌లో ఎక్సలెన్స్ అవార్డులతో పాటు బంగారు పతకం సాధించాడు. సమ్రీన్, ఆర్.నందిని, శ్రీవిద్యానందిని, పార్థివ్‌నందన్, గిరీష్, తన్మశ్రీలు బంగారు పతకాలు సాధించారు. వీరిని పాఠశాలలో గురువారం కాలేజీ కరస్పాండెంట్ లక్ష్మన్న, హెచ్‌ఎం రమణయ్య అభినందించారు.

నర్సరీ నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి

చిన్నమండెం : నర్సరీ యజమానులు వాటి నిర్వహణకు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని రాయచోటి ఉద్యాన అధికారి(హెచ్ఓ) జి.సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని దేవగుడిపల్లె, బెస్తపల్లి, కేశాపురం గ్రామాల్లో కూరగాయాల నర్సరీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీ యజమానులు నాణ్యమైన, అధిక దిగుబడినిచ్చే కూరగాయాల నారును ఉత్పత్తి చేసి విక్రయించాలని సూచించారు. అనంతరం పలు సూచనలు అందించారు.

జాక్‌పాట్‌లు పెడితే లైసెన్స్‌లు రద్దు చేస్తాం

- వాల్మీకిపురం మార్కెట్ కమిటీ హెచ్చరిక
- వాడీవేడిగా సమావేశం



సమావేశంలో సమస్యలు చెప్పుకొంటున్న రైతులు

గుర్రంకొండ: వాల్మీకిపురం మార్కెట్ కమిటీ పరిధిలోని టమాటా మండీల్లో జాక్‌పాట్‌లు పెడితే మండీ యజమానుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని మార్కెట్ కమిటీ పాలకవర్గం వ్యాపారులను హెచ్చరించింది. కాగా వంద టమాటా క్రేట్లకు 10 క్రేట్లు పెట్టేదే అంటూ వ్యాపారులు సవాల్ విసరడంతో మార్కెట్ కమిటీ సమావేశం వాడీవేడిగా జరిగింది. గురువారం స్థానిక మార్కెట్ కమిటీ ఉపకార్యాలయంలో వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి ఆధ్వర్యంలో పాలకవర్గం, వ్యాపారులు, రైతులతో సమావేశం నిర్వహించారు.

అన్నదాతల ఆవేదన

టమాటా మండీల్లో యజమానులు వంద టమాటా క్రేట్లకు 15 క్రేట్ల టమాటాలను జాక్ పాట్ పేరుతో అన్యాయంగా తీసుకొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగు శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉండగా 10 శాతం తీసుకొంటున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. అలాగే వేలంపాటల్లో పాడిన ధరల కంటే రసీదుల్లో తక్కువ ధరలు వేసి బిల్లులు చెల్లిస్తున్నారని వాపోయారు. మండీల యజమానుల అన్ని ఖర్చులు రైతుల మీదే రుద్దుతున్నారని వారి ఆగడాలకు అంతులేకుండా పోతోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు.

జాక్ పాట్ తీసుకొంటాం

రైతులు మార్కెట్‌యార్డు తీసుకొచ్చే టమాటాల్లో వందక్రేట్లకు గానూ పది క్రేట్లు జాక్‌పాట్ కింద తప్పనిసరిగా తీసుకొంటామని వ్యాపారులు తెగేసి చెప్పారు. పాలకవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు దెబ్బతిన్న టమాటాలను తీసుకొస్తున్నారని, వాటిని కొనుగోలు చేస్తే తాము నష్టపోతామని అందువల్ల జాక్‌పాట్‌ల పేరుతో పది క్రేట్లు తీసుకొంటామని పేర్కొన్నారు. కమీషన్ నాలుగు శాతం తమకు గిట్టుబాటు కాదని పది శాతం కమీషన్ తీసుకుంటామన్నారు.

ఎదురుచూపులు

వాల్మీకిపురం మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం తొలిసారిగా గుర్రంకొండ మార్కెట్ కమిటీ ఉపకార్యాలయంలో నిర్వహించారు. సమావేశం 3 గంటలకు నిర్వహిస్తామని అధికారులు మూడు రోజుల కిందటనే వ్యాపారులకు సమాచారం అందించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మార్కెట్ కమిటీ సిబ్బంది ఫోన్ల ద్వారా వ్యాపారులను సమావేశానికి రావాలని కోరినా వారు పట్టించుకోలేదు. పాలకవర్గ సభ్యులు 2.45 గంటలకే మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. అయితే 4 గంటలైనా వ్యాపారులు సమావేశానికి రాలేదు. ఆ తరువాత ఒకొక్కరుగా సమావేశానికి వచ్చినా ఇదేమిటని అధికారులు ప్రశ్నించకుండా వ్యాపారుల కోసం ఎదురుచూశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తరిగొండ నౌషాద్‌అలీ, మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డి, డైరెక్టర్లు ఆనంద, బాబ్‌జాన్, బయ్యారెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌లు మురళీ, ఆనంద్, నౌషాద్, సుంకరశేఖర్, మహాత్మారెడ్డి, సుధాకర్, చంద్రబాబు పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాల్లో ఎదుగుదల

నిమ్మనపల్లె : నట్టల నివారణతో జీవాల్లో ఎదుగుదల ఉంటుందని వెటర్నరీ మదనపల్లె డివిజన్ డీడీ నీరజ అన్నారు. గురువారం ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత నట్టల నివారణ మందును గొర్రెలు, మేకలకు తాగించి, పంపిణీ కార్యక్రమాన్ని మండల వెటర్నరీ అధికారి సురేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవాల్లో నట్టల బెడద సర్వసాధారణమని, నేలకు దగ్గరగా మేత మేయడం వల్ల ఆ సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు. మేత లభ్యం కానప్పుడు, పోషకాల లోపం ఏర్పడినప్పుడు, వానకాలం, అనావృష్టి సందర్భాలు, అంటు వ్యాధులు ప్రబలిన సమయాల్లో ఈ పరాన్న జీవుల బెడద అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకు ఉచిత నట్టల నివారణ మందు మండలంలోని అన్ని గ్రామాల్లోని గొర్రెలు, మేకలకు అందిస్తామని తెలిపారు. పెంపకం దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రాచవేటి వారిపల్లె రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు భూదేవి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేయించాలి

కలికిరి: పాడి రైతులు మూగజీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటమునినాయుడు అన్నారు. పత్తేగడ పంచాయతీ పల్లెలవారిపల్లిలో గురువారం ఉచిత నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేది వరకు కలికిరి ప్రాంతీయ వైద్యశాల పరిధిలో నట్టల నివారణ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఉచితంగా మూగజీవాలకు వేసే నట్టల నివారణ మందును ప్రతి పాడి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యులు గిరినాథ్ రెడ్డి, కీర్తి, సిబ్బంది సయ్యద్ అలీ, రాజ్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిమ్మనపల్లె : గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న వెటర్నరీ డీడీ నీరజ



కలికిరి: గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న ఏడీఏ వెంకట మునినాయుడు

వృద్ధులకు ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ చేయాలి

గుర్రంకొండ: వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల దగ్గరకు వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న ఆదేశించారు. గురువారం గుర్రంకొండలో ఓ వృద్ధురాలు ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని చౌక దుకాణాల డీలర్లందరూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వృద్ధులు, దివ్యాంగులు, బెడ్‌రిడెడ్ రేషన్‌కార్డుదారులకు ఇంటివద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ సదాశివప్పనాయుడు, డీలర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి ఇంటివద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేసిన తహసీల్దార్

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ఎల్. మేఘన

రామసముద్రం: మండలంలోని దిన్నిపల్లి సమీపంలోని మోడల్‌స్కూల్‌కు విద్యార్థిని ఎల్. మేఘన ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మునుస్వామి నాయక్ తెలిపారు. కాగా ఈనెల 9వ తేదీన ఎల్. మేఘన అన్నమయ్య జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు కూడా తీసుకున్నట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. బాలిక ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అంగన్‌వాడీ సెంటర్ల హోదా పెంపు

పెనగలూరు : మండలంలో ఉన్న మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్పు చేసినట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని చక్రంపేట, పెనగలూరు సెంటర్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. మండలంలోని ఆర్.కమ్మపల్లి, గేకుంటవారిపల్లి, కట్టావారిపల్లి, ఎస్టీ కాలనీ, నాయుడువారిపల్లి ఎస్టీ కాలనీ, వడ్డెపల్లి, పాతపల్లి, అరుంధతివాడ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయడం జరిగిందని వారు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్రంలోని 6497 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడానికి కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలకు మారుపేరు అంగన్‌వాడీలని గతంలో వారి 42 రోజుల ఉధృత సమ్మెలో నాటి ప్రతిపక్షంగా హామీ ఇచ్చి నేడు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా అంగీకారం తెలపడం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మీ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ పాల్గొన్నారు.

మత్తు వదిలితేనే భవిత భద్రం

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్
- ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- డ్రగ్స్ అనర్థాలపై అవగాహన ర్యాలీలు



మదనపల్లె: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కన సబ్‌కలెక్టర్, డీఎస్పీ, అధికారులు

మదనపల్లె: యువత మత్తు వదిలి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర పిలుపునిచ్చారు. మదనపల్లెలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకుని గురువారం విద్యార్థులు, ప్రజల, మహిళా సంఘాలతో సభ నిర్వహించారు. ఈ సభలో వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో అనారోగ్యం, జీవితంపై ధ్యాస కోల్పోయి జీవితాలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంచి భవిష్యత్తు కలిగిన యువత జీవితంలో ఉన్నతస్థానాలకు ఎదగడానికి పట్టుదలతో కృషి చేయాలని కోరారు. అనంతరం పట్టణానికి చెందిన వివిధ కళాశాలలు, స్కూళ్లకు చెందిన విద్యార్థులు, ప్రజలు, మహిళలతో నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఫోర్డ్ డైరెక్టర్ లలితమ్మ, ఎక్సైజ్ సీఐ భీమలింగ, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, సీఐలు, ఎస్ఐలు, అధికారులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

తంబళ్లపల్లె: ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఎక్సైజ్ సీఐ మాధవి కోరారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు, వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ, మహిళా సమాఖ్య సభ్యులు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ థామస్, ఎంఈఓ త్యాగరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఎస్ఐ నజీర్ పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

నిమ్మనపల్లె : యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని తహసీల్దార్ తపస్విని అన్నారు. గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, జూనియర్ కళాశాల విద్యార్థులు, మండల స్థాయి అధికారులతో కలిసి, కాలేజీ వద్ద నుంచి మదనపల్లి రోడ్డు, పోలీస్ స్టేషన్, వెంకోజిగారిపల్లె, మీదుగా నిమ్మనపల్లె బస్టాండ్ వరకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి, ఎస్ఐ తిప్పేస్వామి, ఎంఈఓ నారాయణ, డీటీ సిరాజుద్దీన్,ప్రిన్సిపల్ శ్రీధర్, హెచ్‌ఎం అంజాద్ అలీ ఖాన్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం: మాదకద్రవ్యాలతో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోమాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రెవెన్యూ, పోలీస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు , వైద్య సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, ఏపీఎం సాంబశివ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

పీలేరు : మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారమవుతుందని, మాదకద్రవ్యాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యమని సీఐ యుగంధర్, తహసీల్దార్ శివకుమార్ అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురష్కరించుకుని అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకం వల్ల ఆ కుటుంబ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర్, ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి, ఎంఈవో పద్మావతి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ భారతి, ఏఎంసీ చైర్మన్ రామ్మూర్తి, శ్రీకాంత్‌రెడ్డి, సూరి, కిషోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్ఐ హరిహర ప్రసాద్ సూచించారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు వద్దు–చదువు ముద్దు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. డ్రగ్స్ అలవాటుగా మారితే వారి జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. విద్యార్థులు కెరీర్‌పై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెద్దమండ్యం: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పెద్దమండ్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, మత్తు పదార్థాలు తీసుకోవడం వలన జరిగే అనర్థాల గురించి వివరించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

మదనపల్లె సిటీ: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం మదనపల్లెలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. మాదకద్రవ్యాలు వాడకం వల్ల కలిగే నష్టాలు గురించి ప్రిన్సిపాళ్లు కృష్ణవేణి, బాలకృష్ణమూరి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

కేవీపల్లె : యువత జీవితాలను నశనం చేసే మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేవీపల్లెలో అధికారులు, విద్యార్థులు ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత, విద్యార్థులకు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తమ జీవితాలు నాశనం కావడం తోపాటు తమ కుటుంబం మొత్తం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ఎంపీడీవో సుధాకర్, ఎంఈవో రెడ్డిబాషా, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా గుర్రంకొండలో పోలీసులు, విద్యార్థులు అన్ని శాఖల అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండు వరకు సాగింది. అక్కడే మానవహారం ఏర్పాటు చేసి అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. గంజాయి మత్తుకు బానిస కావద్దు, డ్రగ్స్‌ను నిషేధించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘురామ్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో వెంకటేశులు, ఎస్ఐ రఘురామ్, ఎంఈవో సురేంద్రబాబు, సుబ్రహ్మణ్యం, ఏవో దివాకర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగళ్లలో ర్యాలీ

కురబలకోట: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం విద్యార్థులు, వివిధ శాఖల అధికారులతో కలసి అంగళ్లలో ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్, ఎంపీపీ ఎంజీ భూదేవి, తహసీల్దారు ధనుంజయులు, ఎంపీడీఓ గంగయ్య, ఎంఈఓ ద్వారకనాథ్, ఆర్ఐ సి. శేషాద్రిరావు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

కలికిరి: మత్తుతో జీవితాలు చిత్తు అవుతాయని, వాటికి దూరంగా ఉండాలని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కలికిరిలోని శ్రీనివాస డిగ్రీ కళాశాల నుంచి గాంధీ కూడలి వరకు విద్యార్థులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పోలీసు సిబ్బందితో మాదవద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తిరావు, మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్యగంధ, ఎంఈఓ నాగార్జున, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తహసీల్దార్ మహేశ్వరిబాయ్ సూచించారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురష్కరించుకుని కలకడ నుంచి బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు విద్యార్థులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఎస్ఐ రామాంజనేయులు, కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పీలేరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజలు



పెద్దతిప్పసముద్రం: మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



మదనపల్లె సిటీ: ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులు



కేవీపల్లె : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



నిమ్మనపల్లెలో..



కురబలకోట: ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



రామసముద్రంలో..



కలకడ: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 350 మంది హాజరు




ప్రవేశ పత్రం అందజేస్తున్న హరిప్రసాద్

మదనపల్లె సిటీ: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈనెల 25వతేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 350 మంది హాజరయ్యారు. ఈ కౌన్సెలింగ్ ఈనెల 28వతేదీ వరకు జరుగుతుందని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు, కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పాలిసెట్‌లో ర్యాంకులు వచ్చిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజశేఖరయ్య,రాజేష్, రియాజ్ అహ్మద్, బేబీ శ్యామల పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

బి.కొత్తకోట: మండలంలోని గోళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం మానవత సంస్థ నగదు బహుమతి అందించింది. హేమలతకు రూ.3వేలు, సంజనకు రూ.2 వేలు, మరోకరికి రూ.1,500 అందించారు. సంస్థ అధ్యక్షులు రామచంద్ర, కృష్ణారెడ్డి, మనోజ్‌కుమార్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బీరువా వితరణ



బీరువా తాళాలు అందజేస్తున్న చెంగల్‌రాయుడు

మదనపల్లె సిటీ: స్థానిక ఉప విద్యాశాఖ కార్యాలయానికి ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాయుడు బీరువా వితరణ చేశారు. పదవీవిరమణ సందర్భంగా బీరువా అందజేసినట్లు చెంగల్‌రాయుడు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి , విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి చెంగల్ రాయుడు కృషి చేశారని డిప్యూటీ డీఈఓ లోకేశ్వరరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, శ్రీనివాసులు, రాజేంద్రబాబు, యూటీఎఫ్ నాయకులు పురం వెంకటరమణ, చంద్రశేఖర్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలి

సుండుపల్లె : క్షయ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని డాక్టర్ రుబీనా తెలిపారు. మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీ పరిధిలో ముడుంపాడు గ్రామ పంచాయతీ కురవపల్లెలో టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి పాల్గొన్నారు.